# గుండెలోన బండరాయి

అది పల్లెటూరు నుంచి రైల్వేస్టేషనుకు వెళ్ళే రెండు మైళ్ళు పొడవున్న మట్టి రోడ్డు. స్నానం చేయని 'ముష్టివాడి శరీరంలా చెత్తా-చెదారంతో' అసహ్యంగా ఉంది. ఆ రోడ్డుకు మధ్యలో వున్న పంట కాలువకు ఓ చిన్న వంతెన. చెరువు తూములో నుంచి వచ్చే నీళ్ళు ఆ వంతెన గుండా ప్రవహించి పంటపొలాలకు చేరుతాయి.

ఆ పంట కాలువకు ఆ వైపూ, ఈ వైపూ విశాలమైన గట్లున్నాయి. ఆ వంతెన దగ్గర్నుంచి ఇటు తిరిగి కాలువ గట్టునే ఓ యాభై గజాలు నడిస్తే అక్కడో చిన్న పూరి గుడిసె. ఆ గుడిసె ఛగలంతా మన్నుతిన్న పాములాగ పడి ఉంటుంది. పొద్దుగూకి చీకట్లు అలముకోగానే అందులో చలనం కలుగుతుంది. ఆ గుడిసెలో ఉండేది రెండే-రెండు ప్రాణులు. రాత్రంతా వాళ్ళు డ్యూటీ చేస్తారు. పగలంతా నిద్రపోతారు. ఇదీ దాని చరిత్ర.

అప్పుడు రాత్రి తొమ్మిది గంటలు సమయం. అంతకు పది నిముషాల క్రితమే పాసెంజరు రైలు వచ్చి స్టేషన్లో ఆగింది. గుడిసెలో వెలుగుతున్న బుడ్డిదీపం వత్తి సరిచేసి తల్లికి చెప్పి వంతెనవైపు బయలు దేరింది కాంతమ్మ. కాంతమ్మ ముసలి తల్లి కనకమ్మ గుడిసెముందు కుక్కి మంచంలో పడుకొని ఆకాశం వైపు చూస్తోంది.

కాలువగట్టునే నడుస్తూ రోడ్డుమీదికి వచ్చింది కాంతమ్మ. రోడ్డు మీద ఉన్న వంతెనమీద కూర్చొని ఎవరన్నా వస్తున్నారేమోనని నాలుగు వైపులా చూసింది. ఎవరూ వస్తున్నట్లు అలికిడిలేదు. కాంతమ్మకు నిరాశగా ఉంది. రాత్రి రెండుబేరాలు మాత్రమే తగిలాయి. అంటే పది

రూపాయలు ఆరోజు ఆ పదిరూపాయలతో కనాకష్టంగా జరిగిపోయింది. రోజూ ఇలా ఉంటే ఇక పస్తులే అందులోనూ ఇది ఎండాకాలం. ఇప్పుడు బాగా సంపాదించుకొంటే గాని వర్షాకాలంలో బేరాలు లేకపోయినా తమకు జరుగుబాటు ఉంటుంది.

గత వర్షాకాలం గుర్తొచ్చి ఆమె కళ్ళలో నీళ్ళు తిరిగాయి. పోయిన వర్షాల్లో వరుసగా మూడురోజులు ముసురుపట్టింది. తల్లీ కూతుళ్ళిద్దరూ గుడిసెలో ఒక్క మంచాల్లో ముడుచుకు కూర్చున్నారు. మూడురోజులూ తడికె తీసుకొని బయటికి రావడానికి వీల్లేకుండా కుంభవృష్టిగా వర్షం. ఒకవైపు ఎక్కడ కాలువ పొంగి తన గుడిసె కొట్టుకుపోతుందోనని భయం ఇంకోవైపు తిండిలేక చలికి వణుకుతూ కూర్చుని ఉన్న తల్లి ఎక్కడ చచ్చిపోతుందోననిభయం ఆ మూడురోజులూ పస్తులు. నిజంగా ఆ నరకం పగవాడికికూడా వద్దు అనిపించింది కాంతమ్మకు.

ఆ రోజులు గుర్తుకొచ్చినపుడు ఇప్పటికీ వణికిపోతుంది కాంతమ్మ. తన జీవితం తాడులేని బొంగరంలా ఇలా ఎందుకయింది? దీనికి కారణం ఎవరు? పెళ్ళి చేసుకొని భర్తనే దైవంగా పూజిస్తూ పవిత్రంగా బ్రతకాలనుకున్న తను ఎందుకిలా అపవిత్రమైన ఊబిలో కూరుకుపోయింది. మానానికి ప్రాణమిచ్చే తను ఎందుకు మాంసంమీద ఆధారపడి ప్రాణం కాపాడుకొంటూ ఉంది. ఆమెకు తన జీవితంలో జరిగిన సంఘటనలు గుర్తొచ్చి కన్నీటి పొరలతో కళ్ళు మసకలు క్రమ్మాయి.

* * * *

బయలు దేరుతున్నట్లుగా దూరంగా వినిపించిన రైలుకూతకు ఈ లోకంలోకి వచ్చింది. ఏదో చప్పుడయితే ఆ మసక వెన్నెలలో ప్రక్కకు చూసింది. కొద్దిదూరంలో ఒకవ్యక్తి నిలబడి ఉన్నాడు. గడ్డం గుబురుగా పెరిగి ఉంది. పాంటు, షర్టు ధరించి ఉన్నాడు.

ఈ రాత్రికి బేరాలేం లేవు అనుకొంటున్న ఆమెకు ఈ నూతన వ్యక్తి ఇప్పుడు వెళ్ళిన రైలు దిగినట్లుగా అర్ధం చేసుకొంది. ఇతనిచ్చే అయిదు రూపాయలే రేపటికి భుక్తి అనుకొంది ఆమె.

ముఖాన చిరునవ్వు తెచ్చుకొని "రా మావా! ఇంటికెళ్ళి మజా చేసుకొందాం" అంది.

"నేనందుకు రాలేదు ఊళ్లో విషయం నాకొకటి చెప్పాల"

"అట్లాగే చెప్తనుగాని నువ్వు మా ఇంటికి రా" అంటూ ఆమె ముందుకు దారితీసింది. గొర్రె వెనుక నడిచే పిల్లలా ఆమెను అనుసరించాడు అతను.

"ఏ వూరు మన్ది"

"పట్నం"

"పట్నంబాబువన్నమాట" కిలకిలా నవ్వింది కాంతమ్మ.

అతనేం మాట్లాడలేదు.

ఇద్దరూ గుడిసెముందు కొచ్చారు.

"దా. లోపలికి" అంది కాంతమ్మ గుడిసెలోకి దూరబోతూ.

"లోపలి కొద్దు బయటే మాట్లాడుకొందాం"

"అయితే మాకీపూట అయిదు రూపాయలు దక్కవన్నమాట"

"నేనడిగిన దానికి కరెక్టుగా సమాధానం చెబితే అయిదురూపాయలు కాదు. యాభయ్ రూపాయలు ఇస్తాను"

అట్టయితే అడుగు చెబుతా" అంది కాంతమ్మ ఆశగా.

"ఈ వూళ్ళో కాంతమ్మ, ఆమెతల్లి కనకమ్మ అనేవాళ్ళు ఉండే వాళ్ళు వాళ్ళిప్పుడేం చేస్తున్నారో చెప్పగలవా"

"దేనికి?" అడిగింది కాంతమ్మ వణికే గొంతుతో

తన గురించి ఒకవ్యక్తి ప్రత్యేకంగా తననే అడిగేసరికి ఆమెకు భయం పుట్టింది.

అతను తన గురించి అంతా చెప్పి "ఇప్పటికి నేనీ ఊరు వదలి పెట్టి ఆరేళ్ళు. ఇప్పుడు నేను పట్నంలో ఫ్యాక్టరీలో ఉద్యోగం చేస్తున్నా. కాంతమ్మ నిప్పులాంటిది. ఒకసారి మానం ఒకరికిచ్చిన తర్వాత వాణ్నే పెళ్ళాడుతదని నాకు తెలుసు. అందుకే ఆమె సంగతి తెలుసుకొని ఆమెను తీసుకుపోయి పెళ్ళిచేసుకుందామని వచ్చా" అన్నాడు ఎంతో నమ్మకంగా.

అంతే...కాంతమ్మ గుండెలో సముద్రపు హోరు మొదలయ్యింది. గతకాలపు ఆలోచనలు మెదడులో సుడులు తిరుగుతున్నాయి. అయితే తన జీవిత చరిత్రనే తారుమారుచేసి నేటి ఈ పరిస్థితికి కారణమైన శంకరయ్య ఇతనేనన్నమాట. ఎంతలా మారిపోయాడు అనుకొంది కాంతమ్మ.

* * * *

ఆనాడు కాంతమ్మ తల్లిచాటు బిడ్డ. పందొమ్మిదేళ్ళ వయసు. అందమైన ఆమె యవ్వనపుపొంగుల్ని మోయలేక మోస్తోంది ఆమె శరీరం. అయితే బీదరికం ఆమెఇంట్లో కాపురముంది. కాంతమ్మకు తండ్రి లేడు. చిన్నతనంలోనే చనిపోయాడు. తల్లి కనకమ్మే ఆమెను పెంచి పెద్ద చేసింది.

ఆ గ్రామ యువకుడయిన శంకరయ్య కాంతమ్మను మనసారా ప్రేమించాడు. అయితే శంకరయ్య తల్లిదండ్రులు ఎక్కువ కట్నం ఆశి స్తున్నారని తెలిసి కనకమ్మ తనకూతుర్ని దూరంగా ఉంచింది. అయినా

శంకరయ్య ఆమెను మనసులోనే ఆరాధిస్తున్నాడు. సాయంకాలం ఒక నాడు పొలంనుంచి ఒంటరిగా తిరిగివస్తున్న కాంతమ్మను కలుసుకొని 'మనం ఎక్కడైనా వెళ్ళి దొంగపెళ్ళి చేసుకుందాం' రమ్మన్నాడు. ఆమె ససేమిరా తల్లిమాటకు ఎదురుచెప్పనంది. ఆమె అందానికి అప్పటికే ఉద్రేకం చెందివున్న శంకరయ్య చప్పున ఆమె నోరుమూసి దగ్గరలో వున్న తాటిచెట్లమధ్యకు ఎత్తుకువెళ్ళి ఆమెను అనుభవించాడు.

ఆమె కేకలుకు చుట్టుప్రక్కల వెల్తున్న కూలీలు పరుగెత్తుకు వచ్చారు. అప్పటికే ఆ మసకచీకట్లో పరుగెత్తుకు వెళ్ళాడు శంకరయ్య.

ఆ రాత్రి రచ్చబండ దగ్గర పంచాయతి మొదలయ్యింది. వృద్ధు లయిన గ్రామపెద్దలు చెంచునాయుడు, భద్రయ్య, నారాయణ, శరభయ్య సమావేశమయ్యారు. అందరూ శంకరయ్య చర్యను ఖండించారు. కాంతమ్మకు జరిగిన అన్యాయానికి జాలిపడ్డారు.

"వాడ్ని నడివీధిలో నిలబెట్టి, గుడ్డలిప్పి వందకొరడా దెబ్బలు కొట్టాలి" అన్నాడు చెంచునాయుడు.

"గాడిద కొడుక్కి అదేం పని. మనూర్లో ఎప్పుడయినా ఇట్టాంటిది జరిగిందా" ముక్కుమీద వేలేసుకున్నాడు భద్రయ్య.

"వాడు వెధవపని చేసేడు గనుక, దానికి పరిష్కారంగా శంక రయ్య దానికి ఎకరం పొలం రాయాలి."

"అంతేగాదు. వాడుచేసిన పనికి ఇంకదానికి పెళ్ళికాదు. కనక వాడే దీన్ని పెళ్ళి చేసుకోవాలి" అన్నాడు నారాయణ మాటలకు శర భయ్య.

నారాయణ మాటలకు కాంతమ్మ గుండె భగ్గున మండింది. కనక మ్మయితే మరీను. శివాలెత్తిపోయింది.

పెద్ద మనుషుల కెదురుగా నిలబడి చేతులు తిప్పుతూ "అయ్యా! దానిగొంతు పిసికి చంపమన్నా చంపతానుగాని నా బిడ్డకు అన్యాయం చేసిన ఆ రాచ్చసుడి చేతిలో పెడతానా" అంటూ శంకరయ్యను శంకరయ్య వంశాన్ని నానారకాలుగా తిట్టసాగింది.

"కనకమ్మా నువ్వింక మాట్లాడొద్దు. ఒరే నరసయ్యా! నీ సంగతేందిరా. నీ కొడుకు చేసింది ఎదవపని గనుక, నీ ఆస్థిలో ఎకరం పొలం కాంతమ్మ పేరరాయి. వాడు ఇంటికొస్తే మా దగ్గరకు తీసుకురా. వాడెందుకు ఈ పని చేసిండో విచారించాల" అన్నాడు నారాయణ.

నరసయ్య చేతులు కట్టుకొని ముందుకొచ్చి "అయ్యా మీరు చెప్పినట్లు చేస్తా. అయితే పారిపోయిన నా కొడుకుని అడగాల. ఈ పని వాడికై వాడే చేసిండో, అది పిలిస్తే చేసిండో. ఎందుకంటే ఈ కనకమ్మ కాంతమ్మ నా ఆస్థికోసం దోట్లు వేస్తున్నారని నాకు చాలాకాలంగా తెలుసు. ఇదీ అళ్ళప్లాను అని నా అభిప్రాయం" అన్నాడు.

కనకమ్మ ఇది వినంగానే అరుస్తూ కేకలు పెడుతూ నరసయ్య మీదికి పోయింది. పెద్దమనుషులు ఆమెకు సర్దిచెప్పారు.

"ఇప్పుడేమయింది కనకమ్మా, మేము చెప్పిన తీర్మానానికి నరసయ్య ఒప్పుకొన్నాడు గదా. అతనన్నట్లు వాడ్ని కొడుకుతో మాట్లాడనీ. పారిపోయినవాడు ఎన్ని రోజులు బయటుంటాడు. వాడెన్ని చెప్పినా నీ కూతురి పేరిట ఎకరం రాయక తప్పదు" అన్నారు.

పెద్దమనుషుల మాటలకు సంతృప్తి చెందిన కనకమ్మ కూతుర్ని తీసుకొని ఇంటికి వెళ్ళిపోయింది. మిగతా వాళ్ళు కూడా ఎవరి దారిన వాళ్ళు వెళ్ళిపోయారు.

రోజులు గడుస్తున్నాయి. ఆ రోజు నుంచి శంకరయ్య మళ్ళీ ఊళ్ళోకి రాలేదు. తనకు రావలసిన ఎకరం పొలం కోసం కనకమ్మ పెద్దమనుషుల చుట్టూ తిరుగుతూనే ఉంది. వాళ్ళు శంకరయ్య వస్తేనాగాని ఏ విషయం తేల్చడానికి లేదంటున్నారు.

పెద్దమనుషుల చర్యలు కాంతమ్మకు వళ్ళు మండిస్తూ వుంది. ఒక రోజు ఆమె చెంచునాయుడు ఇంటికి బయలుదేరింది. అతని మీద ఆమె కెందుకో మంచి అభిప్రాయముంది. చెంచునాయుడు ఇంటికి వెళితే అతను ఇంట్లో లేడని, తోటలో ఉన్నాడని తెలిసింది. కాంతమ్మ నేరుగా అతని మామిడి తోటలోకి వెళ్ళింది.

తోట ఏపుగా కాపుకాసి వుంది. కొమ్మలు కాయల భారానికి నేలను తాకుతున్నాయి. తోట మధ్యలో వసారా. దానికెదురుగా మామిడి చెట్టు నీడని మంచం వేసుకుని కూర్చొని ఉన్నాడు నాయుడు. నాయుడి కెదురుగా అతని పెద్ద పాలేరు కూర్చుని ఈరోజు ఎన్ని మామిడి కాయలు దింపారో, సాయంత్రం ఈ మామిడి కాయలు బయటికి పోవడానికి ఎన్ని లారీలు అవసరమో చెబుతున్నాడు.

"దండాలయ్యా" అంది కాంతమ్మ నాయుడి కెదురుగా నిలబడి.

నాయుడు తలపైకెత్తి చూసి "ఓసే. నువ్వా కాంతం. అట్టా నీడన కూసో. ఈడ్ని పంపించి వస్తా" అంటూ పాలేరుతో ఇంకో పని నిముషాలు మాట్లాడాడు.

"ఒరే సాయంత్రం నాలుగు గంటలకల్లా ఆ నాలుగు లారీలు ఇక్కడికొచ్చేట్టు సూడు. వచ్చేప్పుడు మనూరులో వాళ్ళనే నలుగురు

కూంలోళ్ళని ఎక్కించుకొనిరా. పట్నం కూలివాళ్ళతో వేగలేం" అన్నాడు నాయుడు. పాలేరు వెళ్ళిపోయాడు.

"ఏందే కాంతం. ఇట్టావచ్చినావు" అని పరామర్శించాడు.

కాంతమ్మ తనకు జరిగిన అన్యాయాన్ని మళ్ళీ గుర్తుకు తెచ్చి తనింక వివాహం చేసుకోనని, తనకు శంకరయ్య తరపున రావాల్సిన ఎకరం ఇప్పిస్తే బ్రతగ్గలనని చెప్పింది.

నాయుడు బాధపడుతూ తలపట్టుకొని చాలాసేపు ఆలోచించి, "నీ యవారం ఇంటూంటే నాకు తలనొప్పిగా ఉండాది పాపం అనకూతురివి ఆ శంకరయ్య అబ్బ నక్కలా తప్పించుకు పోతుండాడు. చూస్తా అది సంగతి. ఓ గంటసేపు పడుకొంటేగాని తల దిమ్ము తగ్గదు. తరువాత నీ సంగతి ఆలోచిస్తా. ఏమనుకోకుండా ఆ వసారాలో మంచం ఎయ్యి" అన్నాడు నాయుడు లేచి నిలబడి.

కాంతమ్మ ఎంతో గౌరవంగా మంచం తీసుకెళ్ళి లోపల వేసింది. తరువాత దిండువేసి, వంగొని దుప్పటి సర్దుతూ వుంది. ఆమె వెనుకనే లోపలికి వచ్చిన నాయుడు ఆమె ఒంపు సొంపులు చూస్తూ తట్టుకోలేక ఆమెను అలాగే పట్టుకొని మంచం మీద పడవేసాడు.

అరగంట తరువాత ఆమెను వదిలిపెట్టి "నా జన్మలో ఎరుగనే కాంతం ఇంత సుఖం నేక్కావల్సినన్ని మామిడికాయలు కోసుకొని పో. నీ ఎకరా సంగతి నేను తేలుస్తానులే. మళ్ళీ రేపు కూడారా" అన్నాడు ఆమె చేయి నిమురుతూ.

కాంతమ్మ ఏడుస్తూ ఇంటికి వెళ్ళిపోయింది. తను ఎంతో మంచి వాడనుకొన్న నాయుడు చేసిన పనికి కుళ్ళి కుళ్ళి ఏడ్చింది. ఈ విషయం తల్లికి కూడా చెప్పదలచుకోలేదు. ప్రయోజనం శూన్యం కనుక. ఐతే

ఆ రాత్రి తల్లి తమకు రావలసిన ఎకరం పొలం గురించి అదే పనిగా గొణుగుతూ ఉంటే కాంతమ్మకు కూడా తమ బ్రతుకు దుర్భరంగా అనిపించింది. మరుసటి రోజు మిగతా పెద్దమనుషులను కలుసుకోవాలను కొంది. కాని అంతలోనే భయం. మళ్ళీ పీళ్ళేం చేస్తారోనని. కాని అంత లోనే ఆమెకు ఓదార్పు. ఒకడు చెడ్డవాడయితే మిగతా అందరూ అలాగే ఉంటారా అని.

ఆమె ఇలా తర్జన భర్జనలు చేసుకొంటూ ఉండగానే ఓ పదిరోజులు జరిగిపోయాయి. చివరకు ఎలాగయితేనేం, ఊళ్ళోని నలుగురు పెద్ద మనుషులలో మచ్చలేని చంద్రుడిగా ఏ అలపాటూ లేని భద్రయ్యను కలుసుకో దలచుకొంది. అనుకున్నదే తడవుగా ఆ రోజు మిట్ట మధ్యాహ్నం వేళ భద్రయ్య ఇంటికి వెళ్ళింది.

అదే సమయానికి భద్రయ్య ఉతికిన బట్టలు ధరించి ఎక్కడికో ప్రయాణమవుతున్నాడు. వీధిగేట్లోంచి పైట భుజం నిండుగా కప్పుకొని వస్తున్న కాంతమ్మను చూసేసరికి ఇంటికి తాళం వేస్తున్న వాడల్లా ఆగి పోయాడు.

కాంతమ్మ వచ్చినపని తెలుసుకొని ఆమెకు జరిగిన అన్యాయానికి పదే పదే బాధపడి తను ఈ విషయం త్వరలోనే తేల్చేస్తానని చెబుతూ "కాంతమ్మా. మీ అమ్మగారూ, పిల్లలూ నిన్ననే ఊరికి ఎల్లారు. వాళ్ళు ఇంకో గంటలో వస్తారు. వాళ్ళ కోసమే రైలుస్టేషనుకు ఎల్తున్నా నువ్వే మనుకోకపోతే వాళ్ళొచ్చేలోగా ఇల్లు కొద్దిగా కడిగిపెట్టే. చాలా అస హ్యంగా ఉంది. మా పనిమనిషి ఇయ్యాల జెరమొచ్చి ఇంట్లో ముడు క్కొంది" అన్నాడు ప్రాధేయపూర్వకంగా.

"ఇదెంతలే అయ్యా. అట్లాగే చేస్తా" అంది కాంతమ్మ తలవొంచు కుని.

లోపలికి వెళ్ళడానికి జంకుతున్న ఆమెతో "కాంతమ్మా నీ విషయము నాకు తెలుసు. మనిషిని నమ్మకపోతే ఈ లోకంలో బతకలేం. ఏం బయపడనూక. ఇంట్లో ఏం బంగారం లేదు. ఇల్లు నీదే అనుకొని శుభ్రముగా కడుగు" అంటూ వడివడిగా బయటకు నడిచాడు.

కాంతమ్మ ఎంతో వినయంగా దొడ్లోకి వెళ్ళి బకెట్లతో బావి నీళ్ళు తెచ్చి ఇల్లు కడగసాగింది. బయటకు వెళ్ళినట్టే వెళ్ళి ఓ ఇరవై నిముషాల్లో తిరిగి ఇంటికి వచ్చాడు భద్రయ్య. అప్పటికే బయట వరండా, హాలు కడిగి లోపల గదులు కడుగుతోంది. హాల్లో అడుగుపెట్టిన భద్రయ్య లోపల గదిలోకి తొంగిచూసాడు.

ఎవరూ లేరుగదానే ధైర్యంతో చీర మోకాళ్ళపై పైగా ఎగదోపి నీళ్ళుపోసి కడుగుతోంది. ఆమె ఊరువులు తెల్లగా ఉన్నాయి. ఆమె ఎత్తయిన రెండు గుండెల మధ్యా మెలితిరిగిన పైట తాడులా భుజంపైకి ప్రాకి నడుముకు చుట్టుకొని వుంది. ఆమెను ఆ స్థితిలో చూసిన భద్రయ్య వళ్ళు వేడెక్కింది. చప్పున ఆమె కెదురుగా నిలబడి, చేతిలోని చెంబుతో వెలవెలా పోయి చూస్తున్న ఆమెను అలాగే ప్రక్కనే ఉన్న బెడ్‌రూము లోకి లాక్కెళ్ళాడు.

"ఏమనుకోకు కాంతం. చాలారోజులనుంచి నీ కోసం చూస్తున్నాను. ఈ రోజుకు ఆ అవకాశం వచ్చింది. ఇది ఎవరికయినా తెలుస్తుందనే భయాలు పెట్టుకోవద్దు. నేనలా స్టేషనుకు ఎళ్లొస్తానుగాని మిగతా గదులు కూడా కడుగు. నా పెళ్ళానికి లేనిపోని అనుమానం" తనపని ముగించుకొని వెళ్తూ కాంతమ్మను హెచ్చరించాడు.

ఆ రాత్రి నిద్రపట్టక రాత్రంతా ఏడుస్తూనే ఉంది కాంతమ్మ. 'తనకు అన్యాయం జరిగిందని పెద్దమనుషుల దగ్గరకువెళితే ఏం జరిగింది?

అంతకంటే ఘోరమైన అన్యాయం చేసారు ఛ...ఇక ఎవడి దగ్గరికి న్యాయం చెప్పమని పోకూడదు. ఇలాగే ఈ బ్రతుకును ఈడిస్తే సరి పోతుంది' అనుకొంది

నెల రోజులు గడిచాయి.

ఆ రోజు తల్లీ కూతుళ్ళిద్దరూ నారాయణ పొలంలో కూలికి వెళ్లారు. పొలంలో గిరకల లోతు నీళ్ళలో దిగి అందరూ నాట్లు వేస్తూంటే గెనిమ మీద నుంచి పర్యవేక్షిస్తున్నాడు నారాయణ.

"పాపం కనకమ్మ కూతురికి అన్యాయం జరిగిపోయింది" అన్నాడు నారాయణ జాలిగా.

కాంతమ్మ కళ్ళలోంచి రెండు కన్నీటిబొట్లు క్రింద నీళ్ళలో రాలాయి. వంగొని నాటేస్తున్న కనకమ్మ ముక్కు ఎగ బీలుస్తూ లేచి నిలబడి పైట నడుముకు చుట్టి దోపుకుంది. తిరిగి వంగి వరికట్ట తీసుకొని మౌనంగా నాటేయడం మొదలు పెట్టింది.

"ఎందుకు ఊళ్ళో ఇంతమంది పెద్దమడుసులుందరు. ఒక్కరయినా ఆళ్ళకు నాయం జేసిర్నా"

"అవునే పేదోళ్ళ కోపం పెదవికి చేటని మన బాధలు ఆళ్ళకేం తెలుస్తయి మారాజులు" అంది ఇంకో స్త్రీ.

అక్కడ కూలికొచ్చిన అందరికీ తెలుసు కాంతమ్మకు జరిగిన అన్యాయం అందుకే అందరూ తలా ఒక మాట అన్నారు. దాంతో నారాయణకు ఆవేశం వచ్చింది.

"ఒసే కాంతం! నా సంగతి ఈళ్ళకి తెలిసినట్టు లేదు. పెద్ద మడుసుల్లేదు, గిద్ద మడుసుల్లేదు. నాతోరా. షెడ్డులో పేనా కాగితాలు ఉండయి. పోలీసాఫీసర్లకి తలా ఒక అర్జీ తగిలిద్దాం అల్లూర్నుంచి అయి

దొరికిపోతాడు. అప్పుడు తెలుస్తుంది ఆ శంకరయ్యకు వాడినాయన సరస య్యకు నా సంగతి" అన్నాడు ఆవేశంగా.

అతనిలో కలిగిన ఆవేశానికి కూలివాళ్ళంతా సంతోషించారు. కాంతమ్మకు ఇష్టం లేకపోయినా వాళ్ళ బలవంతం మీద నారాయణ వెను కనే దగ్గరలోని షెడ్డులోకి పోయింది. షెడ్డులో ఉన్న మంచంమీద కూర్చుని కాగితాలు తీసుకొని అర్జీలు వ్రాయసాగాడు.

"కాంతం కూసో" అన్నాడు.

అతని ఎదురుగా నిలబడి ఉన్న కాంతమ్మ నేలమీద కూర్చుంది.

"అసలు నాయాళ్ళకు ఇదేం పాడుబుద్ధి కాంతం! ఆడది కనబడితే పాడుచెయ్యడమేనా? నా పెళ్ళాం ఆశ్రమంలో చేరి ఇప్పటికి పదేళ్ళు నాకింద మంది ఆడోళ్ళు పనిసేస్తుండరు నేను కావాలంటే వాళ్ళు కాదంటారా?" అన్నాడు కాంతమ్మవైపు చూస్తూ.

కాంతమ్మ మవునంగా తల వంచుకుంది.

"కాని నేనేం చేసాను. కృష్ణా! రామా! అనుకొంటూ పెళ్ళాన్ని తలుచుకొని కాలం గడుపుతుండా. ఇప్పటికిప్పుడు నిన్నడిగితే నువ్వు మాత్రం కాదంటావా" అన్నాడు నారాయణ కాంతమ్మవైపు చిర్నవ్వుతో చూస్తూ.

విషయం తనవైపు తిరిగేసరికి బ్రమాశ్చపడిపోయింది కాంతమ్మ. ఏం మాట్లాడటానికి తోచక నేలమీద వ్రేలితో గీతలు గీస్తూ మవునంగా ఉండి పోయింది.

"ఒసే కాంతం! నేడు తమాసా కన్నాన్లేయే. జవాబు చెప్పు. నిన్ను రమ్మంటే కాదంటావా? ఊరికేలేయే సెప్పు" అన్నాడు పట్టు వదలని విక్రమార్కుడిలా.

ఇక ఆ సంభాషణ పొడిగించడం ఇష్టంలేని కాంతమ్మ తల పైకి ఎత్తి నారాయణవైపు గౌరవపూర్వకంగా చూస్తూ 'కాదనను' అన్నట్లు తలాడించింది.

"ఎట్లయినా నువ్వు మంచిదానవు" అంటూ ఆమె బొటన వ్రేలికి సిరాపూసి అర్జీలమీద వేలిముద్రలు వేయించుతున్నాడు.

వెళ్ళబోతున్న కాంతమ్మను చేయిపట్టుకుని ఆపాడు.

"కాంతం! ఒక్కసారి నువ్వు నాకు కావాలి" అన్నాడు లేచి నిలబడి.

"అయ్యా! మీలాంటి పెద్దోళ్ళకి ఇది తగదు" అంది చెయ్యి విడిపించుకొంటూ.

"కాంతం మాట తప్పకూడదే. ఇప్పుడు చెప్పావుకదే కాదననని. పదేళ్ళనుంచి ఆడమనిసిని తాకి ఎరగనే" దీనంగా బతిమాలుతూ ఆమె మవునాన్నే అంగీకారంగా తీసుకొని మంచం దగ్గరకు నడిపించాడు నారాయణ.

అరగంట తరువాత చేలో పనికి వంగిన కాంతమ్మను చూస్తూ—

"నారాయణ దొర చాలా మంచోడులేయే. నీ కష్టాలు ఇక తీరినట్లే అన్నారు అక్కడున్న మిగతా కూలివాళ్ళు.

కాని వాళ్ళకు తెలియని విషయం. నారాయణ వ్రాసిన అర్జీలు నారాయణ దగ్గరే ఉండిపోతాయని, అవి బయటకు వెళ్ళవని.

రోజులు గడిచిపోతున్నాయి. కాంతమ్మ ఇక ఆశలన్నీ వదలుకొని బ్రతుకుతూ ఉంది. కనకమ్మ ఎప్పుడయినా ఆ విషయం ఎత్తితే కూతురు ఎగిరి పడుతూండడంతో మానుకుంది. ఇద్దరూ కూలికిపోతూ చన్నీళ్ళకు వేడినీళ్ళలా బ్రతుకుతున్నారు.

ఒకరోజు అర్ధరాత్రి తలుపు చప్పుడు వినిపించడంతో లోపల పడుకొని ఉన్న కాంతమ్మ లేచింది. బయట మంచంలో పడుకొని ఉన్న తల్లి మంచినీళ్ళకోసం తలుపు తట్టిందనుకొని వత్తి పెద్దదిచేసి తలుపు తెరిచింది. తోసికొని వచ్చిన ఆ వ్యక్తినిచూసి క్షణకాలం నివ్వెరపోయింది కాంతమ్మ.

"ఏంది శరభయ్య మామా? ఇయ్యేలకాడ ఇట్టావచ్చినావు?" అంది ఎంతో నెమ్మదిగా.

నెత్తిన ముసుగు వేసుకున్న తుండుతీసి భుజాన వేసుకుని, తెల్లని మీసాల్ని మెలేస్తూ "నాయాల్ది ఇన్నాళ్లు గుంటకాడ నక్కలా కూసో ఉండినా. ఇయ్యాల్టికి మీయమ్మ దయతలిచి బయట పొనుకుంది. బయట కూడా బాగా చీకట్లే. ఎవరికీ కనబడకుండా వచ్చినా. తలుపెయ్" అన్నాడు శరభయ్య.

కాంతమ్మకు తన కాళ్ళకింద భూమి కదిలిపోతున్నట్లు అనిపించింది.

"ఏం మావా నువ్వు మాట్లాడేది?" అంది కోపంగా.

"అదేనే. శంకరయ్యగాడు నీకు చేసిన అన్యాయం కళ్ళలో మెదులుతా ఉంటాది. రేపొద్దున అది అబ్బని నడి ఈదిలోకి పిల్చి నీకయ్యే నీకు రాయిస్తా" ధీమాగా అన్నాడు, లోపలికి వచ్చి చొరవగా మంచం మీద కూర్చుంటూ.

"మామా! నీ నీచబుద్ధి బయటపడింది. మర్యాదగా బయటకి నడు నాఅంత మనవరాళ్ళున్నారు. నీకు సిగ్గులేదా. ఛ...నీకు వయసు వచ్చిందే గాని బుద్ధిరాలేదు. పోరా! బయటకి పో..." క్షణక్షణానికి ఆవేశం ఎక్కు

వయి అతని వయసు కూడా మరచిపోయి అరిచింది. ఇన్నిసార్లు మోస పోయిన ఆమె ఈసారి లొంగదలుచుకోలేదు.

ఈ మాటలకు శరభయ్య సిద్ధంగా లేవాడు.

"ఏమిటే...నీతులు చెపుతున్నావే. ఆ నాయుడితో మామిడి తోటలో కులకంగా లేంది, భద్రయ్య బెడ్రూమ్‌లో బరితెగించడం కంటే నేను చేసింది తప్పేదు పనా. మొన్న మిట్ట మధ్యాహ్నం నారాయణకు షెడ్డులో నువ్వేమిచ్చింది నాకు తెలియదనుకొన్నావా. ఇంతలోనే పతివ్రత వయిపోయావా. ఇయ్యాల నాకు లొంగకపోయావంటే రేపొద్దున నీ చరిత్ర నడిబజారులో చెప్పి, నీకు గుండు చేయించి ఊళ్లో గాడిదమీద ఊరేగిస్తా. ముందు తలుపేసిరా" ఆజ్ఞాపించాడు.

ఎక్కడ తన పరువు పోతుందోనని భయపడ్డ కాంతమ్మకు తలుపు వెయ్యక తప్పలేదు. గుడ్లనీరు కుక్కుకుంటూ ఆ రాత్రంతా కాంతమ్మ గడిపితే, తన యౌవనపు రోజులు గుర్తుతెచ్చుకుంటూ వేకువదాకా ఉన్నాడు శరభయ్య.

కాంతమ్మ విషయాలు ఆనోటా ఈనోటా కొంతకాలానికి అందరికీ తెలిసింది. అందరూ డబ్బు ఆశజూపసాగారు. ఆమె డబ్బుకు లొంగలేదు. కాని దౌర్జన్యానికి లొంగాల్సి వచ్చింది. ఎందుకంటే ఆమె తరపున మాట్లాడే పెద్దమనిషి ఆ ఊళ్ళోనే లేడు. ఆమెను ఊళ్ళో కూలికి పిలవడం కూడా మానేశారు. ఇక ఆమెకు బ్రతకడానికి ఆమె మానమే ఆధారమయింది. ఆమె గుండెలో తొలగించలేని బండరాయిని వేసిన పెద్దమనుషులే ఆమెను ఊళ్ళో ఉండడానికి వీలులేదన్నారు. దాంతో ఆమె కాలువ ఒడ్డున గుడిసె వేసుకొని గత ఆరు సంవత్సరాలుగా బ్రతుకుతోంది. తనను మనస్ఫూర్తిగా ప్రేమించి పెళ్ళిచేసుకోవడానికి సిద్ధపడినవాడు మానభంగం చేసాడని తను పెద్ద మనుషులను న్యాయంకోరితే ఒకడు

మంచిమాటలతో, ఒకడు నమ్మకంతో, ఇంకొకడు పెద్దరికం చూపించి, మరొకడు దౌర్జన్యంతో తనను అనుభవించి దూరంగా విసిరివేసాడు.

ఏ మానభంగం జరిగిందని తను న్యాయానికి పెద్దమనుషుల దగ్గరకు పోయిందో, ఆ పెద్దమనుషులే అదే మానభంగం పదేపదే చేసి తనను బహిష్కరించారు.

ఇదీ తనకు జరిగిన న్యాయం.

• • • •

చేతుల్లో ముఖం దాచుకొని పెద్దగా రోదిస్తున్న ఆమెను చూస్తూ— "ఏమిటి? ఏం జరిగింది?" అంటూ ఆశ్చర్యపోయాడు శంకరయ్య.

"అయితే ఆమె ఇప్పుడు ఏ పరిస్థితుల్లో వున్నా ఆమెను చేసుకుంటావా?" అడిగింది కాంతమ్మ.

"తప్పకుండా"

"ఆమె ఇప్పుడు జబ్బు మనిషి అయితేనో, వ్యభిచారం చేస్తుంటేనో" సందేహం వెలిబుచ్చింది కాంతమ్మ.

"నేను ఆమెను ప్రేమించాను. ఆమెతోనే జీవించాలనుకొన్నాను. ఆమె జబ్బు మనిషి అయితే వైద్యం చేయిస్తాను. వ్యభిచారి అయితే మంచి మాటలు చెప్పి మనసు మార్చి నాదాన్ని చేసుకుంటాను" అన్నాడు స్థిరంగా.

"సరే అయితే! నువ్వు చెప్పే కాంతమ్మను నేనే ఆనాడు నువ్వు చేసిన పనే ఈనాడు నన్ను ఈ స్థితికి తెచ్చింది" అంది రోదిస్తూ.

శంకరయ్య నివ్వెరపోయాడు. వాస్తవానికి కాంతమ్మ ఈ పరిస్థితుల్లో ఉంటుందని అతను ఏ మాత్రం ఊహించి ఉండలేదు. అందుకే ఈ నిజాన్ని జీర్ణించుకోలేకపోతున్నాడు.

"కాంతం! నిన్నిప్పటికీ నేను ప్రేమిస్తూనే ఉన్నాను. ఇన్నాళ్ళు అజ్ఞాతవాసం చేసింది నీ కోసమే. నీ గుండెలోని బండరాయిని నేను తొలగిస్తాను. నీ గుండెలు తేలిక చేస్తాను. నిన్ను నా గుండెల్లో పెట్టుకుని పూజిస్తాను. పట్నంలో మనల్ని గురించి అడిగేవాళ్ళుండరు" అన్నాడు కాంతమ్మను దగ్గరకు తీసుకొని.

కాంతమ్మ అతని గుండెల్లో వాలిపోయింది. ఆమె మనసిప్పుడు దూదిపింజంలా ఉంది. తనను మొదట నాశనం చేసాడని భయపడింది. కాని తర్వాత ఆ నరరూప రాక్షసులతో పోల్చుకుని శంకరయ్య ఔన్నత్యాన్ని గుర్తించి అతన్ని ప్రేమిస్తూవుంది. ఇప్పుడు శంకరయ్య గుండెల్లో వాలి అన్ని బాధలూ మరచిపోయింది.

ఆ వేకువ రైలుకు శంకరయ్య వెంట కాంతమ్మ, కనకమ్మ శాశ్వతంగా ఆ ఊరు వదలి వెళ్ళిపోయారు.

● ● ● ●

సరిగ్గా ఇది జరిగిన సంవత్సరానికి నెలల తేడాలో ఆ ఊరిలోని నలుగురు పెద్ద మనుషులూ నాలుగు రకాలుగా చనిపోయారు.

ఒక మధ్యాహ్నం చెంచునాయుడు తన మామిడి తోటలో నురగలు కక్కి చచ్చిపోయాడు. ఓ సాయంత్రం పూట రైలు క్రింద పడి చనిపోయాడు భద్రయ్య. మరో ఉదయం పొలానికి వెళ్ళిన పాలేరుకు తన యజమాని నారాయణ బావిలో శవమై తేలుతూ కనిపించాడు. ఒక అర్ధరాత్రి నిద్ర పోతున్నావాడు నిద్రలోనే చనిపోయాడు శరభయ్య.

మామిడి తోటలో పాము లెక్కువని, ఏదో పాము కరచి చెంచునాయుడు చనిపోయాడని, అదే విధంగా చెముడని అందరూ చెప్పుకునే భద్రయ్య వడి వడిగా వస్తున్న గూడ్సు రైలు శబ్దం వినక దానిక్రింద పడి

చనిపోయాడని, భార్య వదిలేసిన నారాయణ ఒంటరిగా అప్పుడప్పుడు షెడ్డు దగ్గర పడుకుంటాడని, ఈతరాని నారాయణ చీకట్లో షెడ్డు ప్రక్క బావిలో కాలు జారి పడి వుంటాడని అందరూ అనుకొన్నారు. ఇకపోతే వయసు మళ్ళిన శరభయ్యకు గుండె జబ్బని ఊరంతా తెల్సు. నిద్రలోని వాడు సుఖంగా నిద్రలోనే చనిపోయాడు. ఇది మంచి చావు అని చాలా మంది అతని మృతదేహాన్ని అభినందించారు కూడా.

ఇదీ రెండవ తరం పెద్ద మనుషులు, మొదటి తరం పెద్ద మనుషుల చావుని నిర్ణయించిన వైనం. ఎవరికీ అనుమానం లేదు. అన్నీ యాదృచ్ఛిక మరణాలే.

అయితే ఈ యాదృచ్ఛిక మరణాల వెనుక అసలు రహస్యం తెలిసింది శంకరయ్య, కాంతమ్మలకే. ప్రతి ప్లానుకు విందు చేసుకొని, ప్రతి చావుకి పండుగ చేసుకొని ఆనందించారు వాళ్ళు.

చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకొని, న్యాయాన్ని గ్రామ పొలిమేరలు దాటనీయకుండా విచ్చలవిడిగా ప్రవర్తించే ఆ పల్లెటూరి పెద్ద మనుషులు అదే పరిస్థితులకు తాము కూడా బలయ్యారు.

ఇప్పుడు కాంతమ్మ అగ్ని పునీత అయితే, శంకరయ్య అమర ప్రేమికుడు.

కాంతమ్మ గుండెలోని బండరాయి శాశ్వతంగా తొలగిపోయింది.

*